జాతీయ దిన పత్రిక

తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 73 25-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

ప్రజల పక్షాన నిలబడేదే ప్రజాస్వామ్యం..

- బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క ఘాటు విమర్శలు
- "సభలో వినే ఓపిక లేదు.. అహంకారం ఎక్కువ"
- ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద భీమా
- రైతులు, విద్యార్థుల కోసం కీలక పథకాలు

బాంబుల మోతతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్

ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర బాంబుల వర్షం కనిపించని ట్రంప్ 'యుద్ధ విరామ'ప్రభావం

- రెండు ఇంధన వ్యవస్థలకు భారీ నష్టం: ఇరాన్
- టెల్ అవీవ్‌పై భారీ దాడులకు దిగిన ఇరాన్
- బహ్రెయిన్‌పై డ్రోన్ దాడుల్లో సైనికుని మృతి
- యూఏఈలో ఒక కాంట్రాక్టర్ మరణం

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐదు రోజుల విరామం ప్రకటించినా మిత్ర దేశం ఇజ్రాయెల్ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. మంగళవారం కూడా ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులతో విరుచుకుపడింది. ఇరాన్ కూడా దీటుగా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ప్రతి దాడులకు దిగింది. అంతేగాక 'పూర్తి విజయం'సాధించేదాకా పోరాడుతూనే ఉంటామంటూ ఇరాన్ సైన్యం కుండబద్దలు కొట్టింది! దీనికితోడు అమెరికా కూడా వేలాదిమంది మెరైన్ సైనికులను గల్ఫ్‌కు పంపిస్తోంది. దాంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పట్లో సమసిపోయే పరిస్థితులు కన్పించడం లేదు.

మిగతా 2లో

హార్మూజ్ జలసంధిని తెరవాల్సిందే

స్వేచ్ఛాయుత నౌకాయానానికి వీలు కల్పించాలి: మోదీ

ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

రాజీనామాకే మొగ్గు.. నేడు కార్యకర్తలతో సమావేశం

- జీవన్‌రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడి చర్చలు విఫలం?
- మాజీమంత్రి ఇంటికి ఏఐసీసీ కార్యదర్శులు సచిన్ సావంత్, వంశీచంద్‌రెడ్డి
- ఏ పార్టీలో చేరేది ఇంకా స్పష్టం చేయని సీనియర్ నేత

ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్

- పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తాం
- క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని నేరుగా గుర్తించాలనేదే మా లక్ష్యం
- పార్టీ ఆవిర్భావం దినోత్సవంలో బాగాపనిచేసిన 19 మంది కార్యకర్తలకు వేదికపై అవకాశం

2లో

50% నియోజకవర్గాల పెంపుపై హర్షం

- డీలిమిటేషన్‌పై పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు
- ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచన
- జనసేనలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు ఆదేశం

ఉత్తరాంధ్ర' ఇక నుంచి 'ఉక్కు ఆంధ్ర'

ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ అడుగు వేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో సుమారు రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న 'ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్' ప్లాంట్‌కు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఉత్తరాంధ్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.

ఆ ఇకపై ఉత్తరాంధ్ర అంటే కేవలం వెనుకబడిన ప్రాంతం కాదు.. అది 'ఉక్కు ఆంధ్ర'గా పిలవబడుతుంది" అని రాసుకొచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రంగంలో, ప్రతి ప్రాంతంలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.

మనపైనా యుద్ధ ప్రభావం

- అందుబాటులో ఉన్న వనరుల నుంచి గ్యాస్, ముడి చమురు సేకరిస్తున్నాం
- కొత్తగా ఏడు సాధికార బృందాలను ఏర్పాటు చేశాం
- రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఇంధన సంక్షోభం ఏర్పడిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. యుద్ధ ప్రభావం మనపైనా ఉందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరుల నుంచి గ్యాస్, ముడి చమురు సేకరించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ప్రయత్నాలు కొనసాగుతాయని వెల్లడించారు. దేశంలో ఎరువుల సరఫరాకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం

50 శాతం పెంపు ఏ లెక్కన?

- కేంద్రం నిర్ణయంతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం
- ఈ అంశంపై అన్ని రాష్ట్రాలు కలిసి పోరాడాల్సిందే
- యూపీలో 50 శాతం సీట్లు పెరిగితే కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది అవసరమే ఉండదు
- రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోవడం ఖాయం..
- ఓ టీవీ చానల్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ: లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అతి పెద్ద కుట్రగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండానే సీట్లను పెంచాలనే అభిప్రాయం స్వార్థ రాజకీయ ఎత్తుగడలో భాగమే అని విమర్శించారు. 'ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

మనపైనా యుద్ధ ప్రభావం

సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తున్నామని స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ మంగళవారం రాజ్యసభలో ప్రకటన చేశారు. ఇంధన సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకొని లబ్ధి పొందడానికి కొన్ని శక్తులు కాచుకొని ఉంటాయని చెప్పారు. అందుకే నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ఇంధనం, వంట గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎగుమతి, దిగుమతి కార్యకలాపాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేయడానికి, అవసరమైన పరిష్కార మార్గాలు రూపొందించడానికి ఇప్పటికే మంత్రులతో ఒకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందం క్రమం తప్పకుండా సమావేశమవుతోందని అన్నారు. కోవిడ్19 మహమ్మారి సమయంలో వేర్వేరు రంగాల్లో సవాళ్లను ఎదుర్కోవడానికి నిపుణులు, అధికారులతో కూడిన సాధికార బృందాలను ఏర్పాటు చేసిన తరహాలోనే.. సోమవారం కొత్తగా ఏడు బృందాలను ఏర్పాటు చేశామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. సప్లై చైన్స్, పెట్రోలియం, డీజిల్, ఎరువులు, సహజ వాయువు, ద్రవ్యోల్బణం వంటి కీలక అంశాలపై తక్షణ, దీర్ఘకాలిక వ్యూహాల ఆధారంగా చర్యలు తీసుకునే బాధ్యతను ఈ బృందాలకు అప్పగించినట్లు చెప్పారు. సమిష్టి కృషి ద్వారా ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించగలమన్న విశ్వాసం పూర్తిగా ఉందని వ్యాఖ్యానించారు. దక్షిణాసియా యుద్ధం వల్ల మన దేశంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడడానికి, యుద్ధ ప్రభావాన్ని తగ్గించడానికి అవసరమైన వ్యూహాలపై సాధికార బృందాలు కసరత్తు చేస్తాయన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఒక ప్రత్యేకమైన స్వభావం కలదని, దానికి తగినట్టుగానే విభిన్నమైన రీతిలో పరిష్కారాలను రూపొందిస్తున్నామని వివరించారు. ప్రతి సవాలును మనం ఓర్పు, సంయమనం, ప్రశాంతమైన మనసుతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పరిస్థితులు నిరంతరం మారుతున్నాయని, అందుకే ఎలాంటి సవాలుకైనా సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరారు. పశ్చిమాసియా ప్రతికూల పరిణామాల ప్రభావం ఎక్కువ కాలం కొనసాగే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు.

50% నియోజకవర్గాల పెంపుపై హర్షం

(మొదటి పేజీ తరువాయి)

డీలిమిటేషన్ అంశంపై స్పందించారు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. డిలిమిటేషన్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలనిడ పునర్విభజనలో వాస్తవిక దృక్పథం అవసరమని పవన్ స్పష్టం చేశారు. 2009లో జరిగిన పునర్విభజన అనుభవాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా, సహేతుకంగా ఈ ప్రక్రియజరగాలన్నారు. ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువగా ఉండాలనిడ నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు గణనీయంగా పెరుగుతాయనిడ ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలను 50 శాతం పెంచడం హర్షణీయమని పేర్కొన్నారు. 88 అసెంబ్లీ, 12 వరకు పార్లమెంట్ సీట్లు పెరిగిడ దాదాపు 100 మందికి కొత్త అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రక్రియ ఎక్కడా దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేసిన పవన్డ డీలిమిటేషన్‌పై పార్టీ ఎలా ముందుకు వెళ్లాలి, ఎలాంటి కార్యాచరణ ఉండాలన్నదానిపై సూచనలు చేసేందుకు ఎమ్మెల్యేలతో కమిటీ ఏర్పాటు చేయాలని పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు సూచించారు. కమిటీ నివేదిక ఆధారంగా జనసేన డీలిమిటేషన్‌పై తన కార్యాచరణను ఖరారు చేసుకోనున్నట్లు తెలిపారు.

ప్రజల పక్షాన నిలబడేదే ప్రజాస్వామ్యం..

తెలంగాణ శాసనసభలో బడ్జెట్ క్లారిఫికేషన్ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. "గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బడ్జెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు.

'ఉత్తరాంధ్ర' ఇక నుంచి 'ఉక్కు ఆంధ్ర'

(మొదటి పేజీ తరువాయి)

ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, ఇది ఈ ప్రాంతాన్ని ఒక పూర్తి స్థాయి 'స్టీల్ సిటీ'గా మారుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్కు రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యున్నత స్థానానికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రూ.1.36 లక్షల కోట్ల వ్యయంతో ఇది దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఇది అవతరించనుంది. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1 లక్ష మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. రెండు దశల్లో పూర్తయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2028 డిసెంబర్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందించిన పూర్తి సహకారం వల్లే ఇంతటి భారీ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

బాంబుల మోతతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్

(మొదటి పేజీ తరువాయి)

దీనికి తోడు ట్రంప్ పేర్కొన్న చర్చలు మంగళవారం ఏ మేరకు పురోగతి సాధించాలన్న దానిపై కూడా పెద్దగా స్పష్టత లేకుండా పోయింది. అయితే ఈ విషయమై ప్రస్తుతానికి అమెరికా, ఇరాన్ నడుమ విశ్వాస కల్పన చర్యలు కొనసాగుతున్నట్టు ఈజిప్ట్ వెల్లడించింది. యుద్ధానికి తెర దించే దిశగా ఇరాన్‌తో రెండు రోజులకు పైగా కీలక చర్చలు జరుగుతున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించడం తెలిసిందే. "చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఒక ముఖ్య నేతతో పాటు పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, నా అల్లుడు జెరేద్ కుష్నర్ వాటిలో పాల్గొంటున్నారు. చర్చలు ఈ వారమంతా కొనసాగుతాయి"అని ఆయన చెప్పారు. ఇరాన్ మాత్రం ట్రంప్ చర్చల వ్యాఖ్యలను ఖండించింది. ఇరాన్‌లోని ఉత్పత్తి కేంద్రాలే లక్ష్యంగా మంగళవారం భారీ స్థాయిలో దాడులు కొనసాగించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ ఉత్తర ప్రాంతంలో భారీ పేలుడు శబ్దాలు విన్పించాయి. దాడుల్లో రెండు ఇంధన క్షేత్రాలు భారీగా దెబ్బ తిన్నట్టు ఇరాన్ వార్తా సంస్థ ఫార్స్ న్యూస్ పేర్కొంది. "ఇస్ఫహాన్‌లోని సహజవాయు కేంద్రంపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. ఖొర్రంషార్‌లో కీలక విద్యుత్కేంద్రానికి గ్యాస్ సరఫరా చేసే పైప్‌లైన్లు కూడా తీవ్రంగా దెబ్బ తిన్నాయి"అని పేర్కొంది. లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేసింది. బీరూట్ దక్షిణ శివార్లలో హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ స్థావరాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించింది. ఒక అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో కనీసం ముగ్గురు మృత్యువాత పడ్డట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. దాడుల నేపథ్యంలో లెబనాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ రాయబారిని దేశం వీడాల్సిందిగా ఆదేశించింది. ఇరాన్ విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తున్నట్టు కూడా ప్రకటించింది. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైకి పలు దఫాలుగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో టెల్ అవీవ్ నగరంలో భారీ విధ్వంసం జరిగినట్టు తెలుస్తోంది. 100 కిలోలకు పైగా బరువున్న వార్ హెడ్ సిటీ సెంటర్ సమీపంలోని వీధిపై పడింది. ఒక అపార్ట్‌మెంట్‌తో పాటు పలు భవనాలు దెబ్బ తిన్నాయి. నలుగురికి స్వల్ప గాయలయ్యాయి. ఇరాన్ డ్రోన్ దాడులతో కువైట్‌లో విద్యుత్ సరఫరా లైన్లు దెబ్బ తిన్నాయి. దాంతో పలు ప్రాంతాలు గంటల తరబడి చీకట్లో మగ్గాల్సి వచ్చింది. సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. పలు డ్రోన్లను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు నేలకూల్చినట్టు యూఏఈ ప్రకటించింది. ఇరాన్ దాడుల్లో తమ సైనికుడు మరణించినట్టు బహ్రెయిన్ వెల్లడించింది. పలువురు సైనికులకు గాయాలైనట్టు తెలిపింది. యూఏఈలో జరిగిన దాడుల్లో మొరాకోకు చెందిన ఒక కాంట్రాక్టర్ మరణించినట్టు సమాచారం.

హార్మూజ్ జలసంధిని తెరవాల్సిందే

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు త్వరగా సమసిపోవాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. మోదీతో మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా యుద్ధంతోపాటు ప్రధానంగా హార్మూజ్ జలసంధి విషయంలో తాజా పరిణామాలపై వారు చర్చించుకున్నారు. స్వేచ్ఛాయుత నౌకాయానానికి వీలుగా హార్మూజ్‌ను తక్షణమే తెరవాలని మోదీ ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. ట్రంప్ నుంచి తనకు ఫోన్ వచ్చిందని, పశ్చిమాసియా పరిస్థితులపై ఉపయోగకరమైన అభిప్రాయాలు పంచుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హార్మూజ్ జలసంధిని తెరిచి, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరమని స్పష్టంచేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం దిశగా చేపట్టే ప్రయత్నాలపై సంప్రదింపులు కొనసాగించాలని తాము నిర్ణయించామని స్పష్టంచేశారు.

ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్

ఇది టీడీపీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి ఇంకా పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇంఛార్జ్ లకు శిక్షణా తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ యూనివర్సిటీ లాంటిది. ఎంతోమంది గొప్ప నాయకులను తెలుగుదేశం పార్టీ తయారుచేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి తెలుగుదేశం యూనివర్సిటీనే, రెండో ముఖ్యమంత్రి కూడా తెలుగుదేశం యూనివర్సిటీనే. తెలుగుదేశం పార్టీ నాయకులను తయారుచేసే కార్ఖానా. గతంలో గండిపేటలో నిరంతరం పార్టీ శిక్షణ తరగతులు జరిగేవి. చాలా మంది ఉపముఖ్యమంత్రులు అయినవారు ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అయినవారు ఉన్నారు. ఇప్పుడు ఏడాదిలో కనీసం 300 రోజులు పార్టీ శిక్షణ తరగతులు జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం మీకు పదవులు ఇస్తున్నాం, కానీ ఏం చేయాలో చెప్పడం లేదు. చాలామందికి వారి బాధ్యతలు ఏంటో తెలియవు. వేటి ఆధారంగా పార్టీ తమను గుర్తిస్తుందో చాలామందికి తెలియదు. ఈ శిక్షణ తరగతుల ద్వారా వారికి అవగాహన వస్తుంది. పార్టీలో పనిచేసే వారిని గుర్తించేందుకు యాప్ తీసుకువచ్చాం. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల పనిచేసేవారిని, చేయనివారిని గుర్తించవచ్చు. ఓవైపు శిక్షణ తరగతులు, మరోవైపు 'మై టీడీపీ' యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఓ కార్యక్రమానికి పిలుపునిస్తే దానిని సక్రమంగా నిర్వర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. 2019 నుంచి 2024 వరకు మనల్ని ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. అక్రమ కేసులు పెట్టారు. దేవాలయం లాంటి టీడీపీ కార్యాలయంపైనే దాడి చేశారు. ఏ తప్పూ చేయని చంద్రబాబు గారిని 53 రోజుల పాటు రాజమండ్రి జైలులో బంధించారు. దీంతో అందరం ఉద్యమించాం. ఆ ఉద్యమం వల్లే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. వైసీపీని 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారు. ఇందుకు వారి అహంకారమే కారణం. నాకు రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీ వచ్చిందని అహంకారానికి పోకూడదు. అందరినీ కలుపుకొని పోవాలి. కులాలకు అతీతంగా అందరూ నాకు ఓటేశారు కనుకనే అంత మెజార్టీ వచ్చింది. నాపై బాధ్యత పెరిగింది. నా పనులు సక్రమంగా చేస్తున్నాను. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ప్రజలు అహంకారాన్ని ఒప్పుకోరు. అది గమనించాలి. తెలుగుదేశం పార్టీలో క్లస్టర్లది చాలా కీలకపాత్ర. యూనిట్, బూత్ లను సమర్థంగా నడిపించగల వ్యక్తులు మీరు. మీపై బాధ్యత ఉంది. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమీక్షించాలి. మీరు పార్టీని నడిపించాలి.

రాజీనామాకే మొగ్గు.. నేడు కార్యకర్తలతో సమావేశం

జగిత్యాల: తన సమస్యకు కాంగ్రెస్‌లో పరిష్కారం లేదని, అందుకే ఆ పార్టీలో కొనసాగడం సాధ్యం కాదని మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వారం రోజులుగా జీవన్‌రెడ్డి నివాసానికి కాంగ్రెస్ నేతల తాకిడి మొదలైంది. ఎవరు వచ్చినా జీవన్‌రెడ్డి మాత్రం ససేమిరా అంటున్నారు. రెండు రోజుల క్రితం మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వచ్చి చర్చలు జరిపినా, ఆయన నుంచి పెద్దగా స్పందన రాలేదు. తాజాగా మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐసీసీ సెక్రటరీ వంశీచంద్‌రెడ్డి వచ్చి దాదాపు గంటకుపైగా జీవన్‌రెడ్డితో చర్చించారు. వారు జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు చేసినా.. ఆయన మాత్రం గౌరవం లేని చోట ఉండలేనని బహిరంగంగానే చెబుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన పార్టీని వీడటం బాధగానే ఉన్నా.. విలువ లేని చోట ఉండలేనని పేర్కొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం జీవన్‌రెడ్డి వంటి నాయకుడిని వదులుకోలేమని చెబుతున్నా, ఆయన మాత్రం ససేమిరా అంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా కొనసాగిన జీవన్‌రెడ్డి అప్పటి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అనేకం పోరాటాలు చేశారు. మండలి నేతగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. జీవన్‌రెడ్డి ఓడిపోవడం.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ అభివృద్ధి కోసం అంటూ కాంగ్రెస్‌తో చేతులు కలపడంతో జీవన్‌రెడ్డి కినుక వహించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యేకే పెద్దపీట వేయడంతో ఆయన చలించిపోయారు. అప్పటి నుంచే జీవన్‌రెడ్డి తన రూటు మార్చుకున్నారు. ఇటీవల పార్టీ వీడుతున్నట్టు బహిరంగంగానే లేఖ రాశారు. తన నిర్ణయాన్ని ఈనెల 25న ప్రకటిస్తానని చెప్పారు. జీవన్‌రెడ్డి ఇంటికి కాంగ్రెస్ పెద్దలు తరలివస్తున్నా, ఆయన మెట్టు దిగడం లేదు. పార్టీ మారొద్దని వారు పేర్కొన్నా.. పార్టీలో జరిగిన అన్యాయం చాలంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకొని కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని సూచించినా, కప్పుకోనంటూ తేల్చిచెప్పినట్టు సమాచారం. చివరి ప్రయత్నంగా టీపీసీసీ అధ్యక్షుడితోపాటు, ఏఐసీసీ నాయకులు రంగంలోకి దిగినా పరిస్థితి మారలేదు. వంశీచంద్‌రెడ్డి పార్టీ మారొద్దని చెప్పినా, పెద్దగా స్పందించనట్టు తెలిసింది.

50 శాతం పెంపు ఏ లెక్కన?

అంతరం ఎంతుందో అదేస్థాయిలో సీట్ల పెంపు జరగాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం, వివక్ష చూపుతోంది. ఈ విషయంపై దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలో, జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుంది. జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. ఈ విషయమై అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకెళ్లాలి' అని రేవంత్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఓ టీవీ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు, పుదుచ్చేరిలో కలిపి 40, ఉత్తరప్రదేశ్‌లో 80 స్థానాలున్నాయి. 4080లో 40 తేడా ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 80 స్థానాలు 120కి పెరుగుతాయి. ప్రతి చోటా 50 శాతం ఇస్తున్నారని అనుకుంటున్నారు. కానీ.. ఏ లెక్కతో ఇస్తున్నారు. మన దగ్గర వ్యత్యాసం పెంచుతున్నారు. యూపీ, తమిళనాడు మధ్య తేడా 40 ఉంది. ముందు ముందు ఇది 60కి పెరుగుతుంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, బిహార్ ఇలా నాలుగైదు రాష్ట్రాల సీట్లు పెరిగిన తర్వాత అక్కడి నుంచే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చు. తెలంగాణ, ఏపీ కలుపుకొని దక్షిణాది రాష్ట్రాల సీట్లు మొత్తం 130 అవుతాయి. 50 శాతం సీట్లు పెరిగితే అవి

195 అవుతాయి. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు 50 శాతం పెరిగితే దక్షిణాది సీటు ఒక్కటి కూడా అవసరం లేదు. మొత్తం స్థానాలను 815కు పెంచితే అందులో నుంచి 195 తీసివేస్తే.. మమ్మల్ని అడిగేవారే ఉండరు. ఇప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక సీట్లు అవసరం. భవిష్యత్తులో ఆ అవసరమే ఉండదు.

మోదీ త్రీడీ పాలనకు వ్యతిరేకంగా పోరాటం

ప్రధాని మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణ భారతాన్ని ఏకతాటిపైకి తేవాల్సిన అవసరం ఉంది. డీలిమిటేషన్, డివల్యూషన్, డిస్క్రిమినేషన్ ఈ త్రీడీ విధానంలో ప్రభుత్వాన్ని మోదీ నడపాలనుకుంటున్నారు. దీనికి వ్యతిరేకంగా మేము పోరాడాలనుకుంటున్నాం. గతంలో దక్షిణాదికి రాజకీయాల్లో ప్రాముఖ్యత ఉండేది. దక్షిణాదికి చెందిన కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఏపీ, కర్ణాటకల నుంచి ఒక్క నిర్మలా సీతారామన్ మినహా మంత్రివర్గంలో చోటు లేదు. ప్రధాని, రక్షణ, హోంశాఖ, పరిశ్రమలు, కామర్స్ వంటి టాప్ టెన్ పోర్ట్‌ఫోలియోల్లో మనకు ఏమీ దక్కలేదు. రాజకీయ ప్రాధాన్యంలో దక్షిణాదికి చాలా నష్టం జరుగుతోంది. వెంకయ్యనాయుడుకు రాష్ట్రపతి అయ్యేందుకు అవకాశం ఉన్నవేళ ఆయనను ఇల్లు ఖాళీ చేయించి హైదరాబాద్‌కు పంపించేశారు. దక్షిణాదికి ఢిల్లీలో గుర్తింపేలేదు. మోదీ వచ్చిన తర్వాత రాజకీయ వివక్ష ఎక్కువైంది.

కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే. వ్యక్తిగత వైరం లేదు, ఆయన ఇష్టాయిష్టాలతో నాకు పనిలేదు. కేసీఆర్ సమస్య ఆయన కొడుకు, కూతురు, అల్లుడే. గృహ నిర్బంధం చేసి ఏదో రకంగా సీఎం కావాలని చూస్తున్నది అల్లుడు, మీరిద్దరు కాదు నేను సీఎం అవుతా అని కవిత చూస్తున్నది.

హోటళ్లపై పౌరసరఫరాల పంజా

- వలిగొండలో ఆకస్మిక తనిఖీలు.. 15 డొమెస్టిక్ సిలిండర్లు సీజ్
- నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 6ఏ కింద కేసులు నమోదు

వలిగొండ, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): స్థానిక వలిగొండ పట్టణ కేంద్రంలో అక్రమ గ్యాస్ వినియోగంపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ నెల 15న 'గృహ సిలిండర్లకు వాణిజ్య సెగ' అనే శీర్షికతో తొలివెలుగు పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం వలిగొండ పట్టణంలో పలు హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులు చేపట్టారు. పట్టణ కేంద్రంలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఇతర వ్యాపార సముదాయాల్లో గృహోపయోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వాణిజ్య అవసరాల కోసం అక్రమంగా వాడుతున్న మొత్తం 15 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం సామాన్య ప్రజలకు అందించే సబ్సిడీ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన సిలిండర్లకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై నిత్యావసర వస్తువుల చట్టం కింద సెక్షన్ 6ఏ ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యాపారులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లనే వినియోగించాలని, ముందుముందు కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీలలో డీసీఎస్ఓ రోజారాణి, డీటీ బాలమణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

తొలివెలుగు కథనం ఎఫెక్ట్

ప్లాస్టిక్ వద్దు.. ఆరోగ్యం ముద్దు!

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి..
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాహత్ ఖానం

రామన్నపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): ప్లాస్టిక్ రహిత రామన్నపేటగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు రాయబారులుగా మారాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం అన్నారు. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకేసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వస్తువుల వల్ల ప్రకృతికి కోలుకోలేని నష్టం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, చెక్కతో చేసిన వస్తువులను వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ విశ్లేషకులు డి. తేజస్వి, ఎన్. అజిత్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ భూతం ప్రాణికోటిని పట్టిపీడిస్తోందని, దీని నుండి బయటపడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత జీవనంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, ఎన్ఎస్ఎస్ అధికారి టి. శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ జి. సునీత, డాక్టర్ కృష్ణ, డాక్టర్ వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ పి. బ్రహ్మం, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాహితీ శిఖరం.. కూరెళ్ల విఠలాచార్య

- 'సాహిత్యం-సమాలోచనం' పుస్తక సమీక్ష.. డిగ్రీ కళాశాలలో వేడుక
- ఘనంగా పుస్తక సమీక్షా కార్యక్రమం..
- పద్మశ్రీ గ్రహీత సేవలను కొనియాడిన ప్రిన్సిపల్

రామన్నపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): అక్షరాన్నే ఆయుధంగా మలుచుకుని, తన నివాసాన్నే గ్రంథాలయంగా మార్చిన మహనీయుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం కొనియాడారు. మంగళవారం కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం - సమాలోచనం" పుస్తక సమీక్షా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాశరథి పురస్కార గ్రహీత అయిన విఠలాచార్య సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహించి, దానిని పుస్తక రూపంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. పుస్తక సంపాదకులు, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ మాట్లాడుతూ.. జాతీయ సదస్సులో 31 మంది ఆచార్యులు, పరిశోధకులు సమర్పించిన పరిశోధనా వ్యాసాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ గ్రంథాన్ని 'మూసీ' ప్రత్యేక సంచికగా వెలువరించిన ఆచార్య సాగి కమలాకర్ శర్మకు, ప్రచురించిన కూరెళ్ల ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్ బీర్ల ఐలయ్యను విమర్శిస్తే ఖబడ్దార్!

- ఆలేరు అభివృద్ధి ప్రధాతపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఘాటు హెచ్చరిక

ఆత్మకూరు (ఎం), మార్చి 24 (తొలివెలుగు న్యూస్): తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బీర్ల ఐలయ్యను విమర్శిస్తే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. గత పదేళ్లుగా అధికారంలో లేకపోయినా, కరోనా వంటి విపత్కర కాలంలో నియోజకవర్గంలోని ప్రతి గడపకూ నిత్యావసర సరుకులు, కూరగాయలు, మాస్కులు పంపిణీ చేసిన గొప్ప మనసున్న నాయకుడు ఐలయ్య అని కొనియాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా సొంత ఖర్చుతో వాటర్ ప్లాంట్లు, ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించిన సేవాతత్పరుడిపై బురద చల్లడం సరికాదన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడిని విమర్శించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరేందర్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధులు, ప్రధాన కార్యదర్శి అనంత రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు నర్సిరెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, కిష్టయ్య, ఎల్లయ్య, ఉప్పలయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ప్రగతి పథం..

- 556 కోట్లకు చేరిన పోచంపల్లి అర్బన్ బ్యాంక్ వ్యాపారం
- 52వ వార్షిక సర్వసభ్య సమావేశంలో చైర్మన్ తడక రమేష్ వెల్లడి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యాపారం రూ.556 కోట్లకు చేరుకుందని బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ తెలిపారు. మంగళవారం పురపాలక కేంద్రంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 52వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్ వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్గొండ జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా 22 శాఖలతో బ్యాంక్ ఖాతాదారులకు ఆధునిక సాంకేతిక సేవలను అందిస్తూ విశ్వసనీయతను సంపాదించుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే 21 శాఖల ద్వారా రూ.313.62 కోట్ల డిపాజిట్లు సేకరించామని, రూ.242.03 కోట్ల రుణాలను ఖాతాదారులకు అందజేశామని తెలిపారు. తెలంగాణలోని కోఆపరేటివ్ బ్యాంకుల్లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ప్రతిష్టను మరింత పెంచిందన్నారు. భవిష్యత్తులో బ్యాంక్‌ను మరింత అభివృద్ధి పరచేందుకు పాలకవర్గం శాయశక్తుల కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సురపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ, కొల్లి రామ్ గోపాల్ రావు, కౌన్సిలర్ కొండమడుగు ఎల్ల స్వామి, రాపోలు భావన ఋషి, మిర్యాల యాదగిరి, బ్యాంక్ వ్యవస్థాపక కమిటీ సభ్యులు కొండా శంకరయ్య, కుడికాల బాల నరసింహ, భోగ సిద్ధిరాములు, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల కాలనీల్లో పనులు వేగవంతం చేయండి: కలెక్టర్

- బి.ఎన్. తిమ్మాపురం, లప్పానాయక్ తండా లేఅవుట్ల తనిఖీ

యాదాద్రి భువనగిరి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డిలతో కలిసి భువనగిరి మండల పరిధిలోని బి.ఎన్. తిమ్మాపురం, లప్పానాయక్ తండా పునరావాస లేఅవుట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లేఅవుట్లలో సాగుతున్న సివిల్ పనులు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్వాసితులు నివసించేందుకు అవసరమైన రహదారులు, విద్యుత్ కాంతులతో ప్రభుత్వం సౌకర్యం కల్పనలో జాప్యం చేయవద్దన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుందని అధికారులను ఆరా తీశారు. వర్షాకాలం దృష్ట్యా కాలనీలోని మట్టి రహదారులను చదును చేయాలని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో భువనగిరి తహసీల్దార్ జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారానే ఇసుక సరఫరా.. అక్రమ రవాణాపై ఉక్కుపాదం!

- సాండ్ కమిటీ భేటీలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టీకరణ

యాదాద్రి భువనగిరి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): జిల్లాలో ఇసుక సరఫరాను మరింత పారదర్శకం చేసేందుకు పూర్తిగా ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు, ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుకింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపాలు లేకుండా చూడాలని, ప్రజలకు ఇసుక లభ్యతపై స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, జిల్లా రవాణా అధికారి హరికృష్ణతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురుకులంలో ఏడీసీ తనిఖీ.. వంటల నాణ్యతపై ఆరా

- పదో తరగతి విద్యార్థులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం

మోత్కూరు, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశించారు. మంగళవారం ఆయన మోత్కూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. వంటగదిలోకి వెళ్లి నిల్వ ఉన్న బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నం వండేటప్పుడు నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. బియ్యం సరిగ్గా లేకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పాలు, భోజనం సరైన పరిమాణంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి, పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): ప్రజాసంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన కాసుల అనసూయకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైన చెక్కును మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫక్కీరు లతా నర్సిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఫకీరు మల్లారెడ్డి, నాయకులు గట్టు రాంరెడ్డి, ఏలూరు బాల్ రెడ్డి, కాసుల మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం.. క్రీడా స్ఫూర్తి!

- బాధితుడికి దేశ్‌ముఖి కబడ్డీ జట్టు ఆర్థిక సాయం
- విజేతలను అభినందించిన గుండ్ల రాజు యాదవ్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): క్రీడల్లో రాణించడమే కాకుండా సామాజిక బాధ్యతలోనూ తాము ముందుంటామని దేశ్‌ముఖి గ్రామ కబడ్డీ జట్టు నిరూపించుకుంది. గ్రామానికి చెందిన చింతపట్ల శివ ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకోగా, అతడి ఆర్థిక పరిస్థితిని గమనించిన కబడ్డీ జట్టు సభ్యులు రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు గుండ్ల రాజు యాదవ్ చేతుల మీదుగా ఈ నగదును బాధితుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ.. క్రీడాకారులు సేవా గుణాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు. ఇటీవల భువనగిరిలో జరిగిన అసెంబ్లీ స్థాయి కబడ్డీ పోటీల్లో దేశ్‌ముఖి జట్టు ప్రథమ స్థానంలో నిలిచి, గవర్నర్ శివ ప్రసాద్ శుక్ల చేతుల మీదుగా రూ. 50,000 నగదు బహుమతి, షీల్డ్ అందుకోవడం గర్వకారణమని కొనియాడారు. క్రీడలతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కబడ్డీ జట్టు కెప్టెన్ మహేష్, 10వ వార్డ్ సభ్యుడు ఇరుగు రాములు, రాసాల శ్రీకాంత్, తోటకూరి మధు, మేకల సాయి, జగన్మోహన్ రెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర నాయకుల ముందస్తు అరెస్టు

- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసుల అడ్డగింత

- ఎస్టీ రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం ఆగదు: బోదాసు నరసింహ

చౌటుప్పల్, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): ఎస్టీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమని వడ్డెర సంఘం నాయకులు బోదాసు నరసింహ విమర్శించారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడి యత్నంలో పాల్గొనేందుకు సిద్ధమైన నేపథ్యంలో, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని వడ్డెర సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బోదాసు నరసింహ మాట్లాడుతూ.. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నా వడ్డెరల జీవన పరిస్థితుల్లో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని, హక్కుల సాధన కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, వాటి ఫలాలు వడ్డెరలకు అందడం లేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేక పేదరికంలోనే జీవిస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా వడ్డెర సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

రాజపేటలో రామయ్య పెళ్లికి వేళాయె!

- 27న వైభవంగా కళ్యాణ తంతు.. ఏర్పాట్లలో నిమగ్నమైన కమిటీ

రాజపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): రాజపేట పట్టణంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఈ నెల 27వ తేదీన శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో నిర్వాహకులు వివరాలు వెల్లడిస్తూ, ఆలయ ట్రస్ట్ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, శోభారాణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేడుకల కోసం ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయని తెలిపారు. ఆలయాన్ని పూలమాలలు, పచ్చని తోరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా ముస్తాబు చేయనున్నట్లు వివరించారు. శ్రీ స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి, అనంతరం నూతన వస్త్రాల అలంకరణ తర్వాత కళ్యాణ తంతు కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టనున్నట్లు చెప్పారు. దాతలు, చిట్టి సభ్యుల సహకారంతో కార్యక్రమం నిర్వహించబడుతుండగా, 2005-06 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తెలిపారు. దాతల గోత్రనామార్చనలతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే పుణ్య దంపతులు తమ వివరాలను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అమ్మాయిల ఫోటోలు, వీడి యోలు ఫోన్లో ఉన్నందున షీ టీం ఫిర్యాదుతో కేసు, నిందితుడి అరెస్ట్, రిమాండ్

- టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఈనెల 19న రెండు కేసులు నమోదు
- చట్టాన్ని ఎవరు కూడా చేతి లోకి తీసుకోవద్దు
- ఎలాంటి సమస్యలకైనా పోలీ సులను సంప్రదించాలి
- బలవంతంగా ఫోన్ లాక్కొని తనిఖీ చేసి దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు
- వివరాలను వెల్లడించిన ఆది లాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు

ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 24, (తొలివెలుగు న్యూస్): ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 19వ ఆదిలాబాద్ పట్టణం షాద్నగ ర్ కు చెందిన తౌఫీక్ ఉల్లాఖా న్ తన మొబైల్ ఫోన్ లో జూ నియర్ కళాశాలలో విద్యార్థు లుగా ఉన్నటువంటి అమ్మా యిల ఫోటోలను, వీడియో లను అసభ్యకరంగా తీస్తూ ఉ న్నాడనే షీ టీం ఫిర్యాదుతో, అతనిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, సోమవారం అరెస్టు చేసి రి మాండ్ కు తరలించడం జరి గిందని టూటౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు తెలియజేశారు. మ రొక కేసు అదేరోజు జరిగిన ఘటనలో నిందితుడిపై దాడి చేసిన కేసులో పలువురిపై న మోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని షాద్‌నగర్‌కు చెందిన తౌఫిక్ ఉల్లాఖాన్ వేదాంత్ అకాడమీ వద్ద ఉండగా, పట్టణానికి చెం దిన బండారి సంతోష్, కార్తిక్, అక్షయ్‌తో పాటు మరికొంత మంది వ్యక్తులు అతని వద్దకు వెళ్లి యువతుల ఫొటోలు సెల్ ఫోన్‌లో ఉన్నాయని ఫోన్ లా క్కున్నారు. అతనిపై చెయ్యి చేసుకున్నారు. దీంతో బాధితు డు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకోవ ద్దని, ఏదైన ఉంటే పోలీసుల కు సమాచారం అందించాలని సూచించారు. యువతులు, మహిళలకు సంబంధించిన ఫొటోలు వారికి తెలియ కుం డా తీయవద్దని, సెల్‌ఫోన్‌లో ఉంచవద్దని పేర్కొన్నారు. ని బంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామచంద్రుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఘనంగా ద్వితీయ కుంభాభిషేక కార్యక్రమాలు - హోరెత్తిన రామనామ స్మరణ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని శివరెడ్డిగూడెం గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు ద్వితీయ కుంభాభిషేక కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాలు భక్తి శ్రద్ధలతో కళకళలాడాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మేకల రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంభాభిషేక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం రుత్వికుల ఆధ్వర్యంలో శ్రీరామ మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. యజ్ఞ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై శ్రీ సీతారాముల ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిలకల సంతోష్ యాదవ్, మాజీ సర్పంచ్ ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, ఆలయ వైస్ చైర్మన్ వారాల వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వారాల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల చొక్కా రెడ్డి, ప్రచార కార్యదర్శి దొంతమనే భగవాన్, సంయుక్త కార్యదర్శి మేకల రవీందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వారాల వాసుదేవ రెడ్డి, చిలుకల మల్లేష్, మేకల రామలింగారెడ్డి, వంగేటి సత్తిరెడ్డి, వారాల రాజగోపాల్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- తంగడపల్లి పీహెచ్‌సీలో ఉచిత వైద్య పరీక్షలు మందుల పంపిణీ

- ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా శిబిరం నిర్వహణ

- గైనకాలజీ నుంచి జనరల్ మెడిసిన్ వరకు పరీక్షలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

చౌటుప్పల్, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, డెంటల్, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్ రాంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ లక్ష్మీపురం యశోద, మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు, కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్, ఆలె శ్రీలత చిరంజీవి, బుడ్డ సూరేష్, డాక్టర్ సికిలంమెట్ల జయంత్ కుమార్, డా. రమేష్, డా. గాంధీ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

ఫార్ములాఈ రేస్ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే..

పునర్విభజన చట్టం ప్రకారం పునర్విభజన జరగాలి

టీడీఆర్ కొనుగోలుతో రేవంత్ కుటుంబం భారీ స్కామ్

హైదరాబాద్: ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై అసెంబ్లీలో బీఆర్ఎస్ తెస్తున్న ప్రైవేటు మెంబర్ బిల్లు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చార్జిషీటు పేరిట మళ్లీ తెరపైకి ఫార్ములాఈ తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చేసిన తొలి సంతకానికి సంబంధించిన ఫైలు దొరకడం లేదనే విషయాన్ని బీఆర్ఎస్ బయటపెట్టడంతో సర్కారు ఇరకాటంలో పడిందన్నారు. గతంలో తాను చెప్పినట్టు ఫార్ములాఈ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసు అని చెప్పారు. శాసనసభ లాబీల్లోని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చాంబర్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఫార్ములాఈ అంశాన్ని గోరంతను కొండంతగా చూపే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోంది. ఇక్కడి నుంచి పంపిన నిధులు రూ.45 కోట్లు అయితే రూ.600 కోట్లకు పైగా ఉన్నాయని తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. తెలంగాణ నుంచి పంపిన రూ.45 కోట్లు ఫార్ములాఈ బ్యాంకు ఖాతాలో భద్రంగా ఉన్నాయి. ఆ నిధులను ప్రభుత్వం ఎందుకు వెనక్కి రప్పించడం లేదు. ఈ కేసులో అనుచిత లబ్ధి జరిగిందని చెబుతున్న వారి పేరు చార్జిషీటులో లేదు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'అందాల పోటీల వల్ల తెలంగాణకు పైసా ప్రయోజనం లేకపోగా తనను లైంగికంగా వేధించారని మిస్ యూకే చేసిన ఆరోపణలతో రాష్ట్రం అంతర్జాతీయంగా అప్రతిష్టపాలైంది. ఇంత దారుణం జరిగినా ఒక్క కాంగ్రెస్ నాయకుడిపైనా కేసు నమోదు కాలేదు. సీఎం సరదా కోసం రూ.100 కోట్లతో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించి సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేసినా కేసు నమోదు కాలేదు. ఫార్ములాఈ కేసు న్యాయస్థానాల్లో నిలబడదు. ప్రభుత్వం ఎన్ని విధాలుగా దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేసినా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను వదిలిపెట్టేది లేదు'అని కేటీఆర్ చెప్పారు. 'రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూపాయి లేకున్నా ఏడీబీ అప్పు ఇస్తుందనే ఉద్దేశంతో డీపీఆర్ లేకుండానే మూసీ అభివృద్ధి ప్రణాళిక చేపడుతోంది. మూసీ ప్రాజెక్టుపై ఫైవ్ స్టార్ హోటళ్లలో కాకుండా మూసీ బాధితులతో చర్చించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు మేధా పాట్కర్ వంటి మేధావులు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నారు'అని కేటీఆర్ అన్నారు. '2014 నాటి రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే స్వాగతిస్తాం. జనాభా ప్రాతిపదికన కాకుండా 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతమున్న నిష్పత్తిలో పునర్విభజన జరగాలి. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి 24శాతం ప్రాతినిధ్యం ఉంది. అదే నిష్పత్తిలో దక్షిణాదికి నష్టం జరగకుండా కేంద్రం చూడాలి. అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుదల ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుంది. అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా, వాటి గొంతు కోయకుండా డీలిమిటేషన్ చేస్తే స్వాగతిస్తాం'అని కేటీఆర్

"ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) పేరిట రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు కచ్చితంగా టీడీఆర్‌లు కొనుగోలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తెచ్చింది. మా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ కుంభకోణంపై విచారణ జరిపిస్తాం. నిర్వాసితుల నుంచి అతి తక్కువ ధరకు టీడీఆర్ కొనుగోలు చేసి వాటిని అడ్డగోలు ధరలకు తిరిగి అమ్ముకుంటున్న రేవంత్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పాత్రను బయటపెడతాం. రేవంత్ పాలనలో టీడీఆర్ అంటే 'తిరుపతి రెడ్డి డెవలప్‌మెంట్ రైట్స్'గా మారిపోయాయి. త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రేవంత్ కుటుంబం టీడీఆర్‌లను ఏటీఎంగా మార్చుకున్న తీరును బయటపెడతాం'అని కేటీఆర్ చెప్పారు.

పాత ఉపాధి చట్టాన్నే కొనసాగించాలి

- కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

రాజాపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో తీసుకువచ్చిన మార్పులను రద్దు చేసి, పాత చట్టాన్నే యథావిధిగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌల్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజపేట మండలం బొందుగుల గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. కొత్త నిబంధనల వల్ల కూలీలకు రావాల్సిన హక్కులు హరించుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ పథకం పేదలకు, చిన్న రైతులకు అండగా ఉండేదని, ప్రస్తుత మార్పులు కేవలం భూస్వాములకు, పెట్టుబడిదారులకు మేలు చేసేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవని దుయ్యబట్టారు. ఫోటోలు తీసే కొత్త నిబంధనతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పులి మల్లేశం, కట్ట శ్రీకాంత్, బోడా శేఖర్, బాల్దే బాబు, సీసా మల్లేష్, మొక్క వరలక్ష్మి, దొరకల సత్తయ్య, చింతకాయల కిష్టయ్య, ముత్యం చంద్రమ్మ, ముత్యం సంతోష, వార్డు సభ్యురాలు సత్యవనజ తదితరులు పాల్గొన్నారు.

రాజపేటలో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు

- అక్రమ అరెస్టులకు భయపడబోమన్న నేతలు

రాజపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): రైతు భరోసా, రుణమాఫీ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ బీఆర్ఎస్వీ పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే మండలంలోని ముఖ్య నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు ఠాగూర్ భగత్ సింగ్, జనరల్ సెక్రెటరీ మిట్ట కార్తీక్‌లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గళమెత్తుతుంటే అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. పోలీసుల అదుపులోకి తీసుకున్న వారిలో మండల ఉపాధ్యక్షుడు ఎర్ర గోకుల జస్వంత్, పట్టణ అధ్యక్షుడు బెడితే వీరేశం, సెక్రెటరీ రెడ్డబోయిన రాజు, వరుణ్ రమేష్, మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్య, నేత విష్ణు తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్టలో ఎస్పీఎఫ్ సిబ్బంది 10 కిలోమీటర్ల పరుగు

- శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపే లక్ష్యం

యాదగిరిగుట్ట, మార్చి 24: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతలో పాలుపంచుకుంటున్న టీజీ ఎస్పీఎఫ్ (తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం) సిబ్బంది మంగళవారం ఉదయం 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆదేశాలు, కమాండెంట్ ఎన్. త్రినాధ్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. స్థానిక తులసి కాటేజ్ నుంచి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు, జవాన్లు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరి రావు మాట్లాడుతూ.. సిబ్బందిలో నిరంతరం శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను పెంపొందించడమే ఈ పరుగు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన భద్రత కల్పించేందుకు, సిబ్బందిని మానసికంగా, శారీరకంగా సిద్ధం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని పరుగును విజయవంతం చేశారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 'ఐలు' అభ్యర్థుల ఘనవిజయం

- రామన్నపేటలో న్యాయవాదుల సంబరాలు.. మిఠాయిల పంపిణీ

రామన్నపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) బలపరిచిన అభ్యర్థులు మందడం శ్రీనివాసరావు, సిహెచ్ శైలజ ఘన విజయం సాధించడంతో మంగళవారం రామన్నపేట బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే ఐలు అభ్యర్థులను గెలిపించడం శుభపరిణామన్నారు. బార్ కౌన్సిల్‌లో న్యాయవాదుల సమస్యలపై వీరు గళమెత్తుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి

మజీద్, ఉపాధ్యక్షులు యాదాసు యాదయ్య, హనుమంతు గౌడ్, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు జగతయ్య, న్యాయవాదులు కెమె రామదాసు, బాతరాజు అశోక్ కుమార్, డేవిడ్, దినేష్, నోముల స్వామి, సతీష్ రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీహరి ఏకగ్రీవం

- వరుసగా రెండోసారి బాధ్యతలు.. నూతన కార్యవర్గం ఎన్నిక



యాదగిరిగుట్ట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా సూదగాని శ్రీహరిని వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పెంట రమేష్, సారాశి సంతోష, ప్రధాన కార్యదర్శిగా అయిరేని కృష్ణ, సహాయ కార్యదర్శిగా దండమేని గణేష్‌లు ఎన్నికయ్యారు. అలాగే క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి. రేణుక, కార్యవర్గ సభ్యులుగా కనకరాజు, నవితలను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీహరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి అవకాశం కల్పించిన తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో యాదగిరిగుట్ట కోర్టుకు సొంత భవనం (పర్మినెంట్ బిల్డింగ్) సాధించేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు గుడ్ల స్వామి, మొగుల్లా రాజిరెడ్డి, గొట్టిపాముల సాయికృష్ణ, డప్పు వీరస్వామి, ఎరుకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు!

- రామన్నపేటలో బీఆర్ఎస్వీ శ్రేణుల నిర్బంధం

రామన్నపేట, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్వీ పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే మండలంలోని ముఖ్య నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు జాల అమరేందర్ రెడ్డి ఇంటికి వెళ్లిన పోలీసులు, ఆయనను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అమరేందర్ రెడ్డితో పాటు సోషల్ మీడియా మండలాధ్యక్షుడు ఆవుల శ్రీధర్, వార్డు సభ్యుడు నల్ల సైదులు, నాయకులు చెరుకు ఉపేందర్, కొండగడప చింటూ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల పక్షాన పోరాడుతుంటే అక్రమ అరెస్టులతో ప్రభుత్వం గొంతు నొక్కాలని చూడటం సరికాదని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

చౌటుప్పల్ చెరువుకు 'అలుగు కాలువ' నిర్మించాలి

- కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు

చౌటుప్పల్, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): చౌటుప్పల్ చెరువు నిండిన సమయంలో అలుగు నీరు సక్రమంగా వెళ్లే విధంగా ప్రత్యేక కాలువ నిర్మాణం చేపట్టాలని 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ – దాసు కోరారు. ఈ మేరకు సీపీఎం పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. చెరువు నిండినప్పుడు అలుగు నీరు ఒకే వైపు డ్రైనేజీ ద్వారా వెళ్లడం వల్ల పట్టణంలోని వ్యాపార దుకాణాల్లోకి నీరు చేరుతున్నదని, కాలనీల్లోకి వరద నీరు చేరడంతో పాటు రోడ్లపై నీరు నిలిచిపోతున్నదని వారు వివరించారు. దీని వల్ల వ్యాపారస్తులకు ఆర్థిక నష్టం కలగడమే కాకుండా వాహనదారులకు ప్రాణహాని కూడా ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. హైవే విస్తరణలో భాగంగా రెండో వైపు ఉన్న డ్రైనేజీలోకి కూడా అలుగు నీరు మళ్లేలా పైపులైన్ లేదా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా చెరువు నిండినప్పుడు కట్టకు ఎలాంటి ప్రమాదం ఉండదని, పట్టణంలో నీటి నిల్వ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, నాయకులు బండారు నరసింహ, మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్, బొడ్డు అంజిరెడ్డి, బత్తుల దాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు!

- నారాయణపురంలో పోలీసుల నిర్బంధకాండ.. బీఆర్ఎస్వీ నేత రమేష్ అరెస్టు

సంస్థాన్ నారాయణపురం, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ చేపట్టిన నిరసన పిలుపు ఉద్రిక్తతకు దారితీసింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు మంగళవారం రాత్రి నుంచే బీఆర్ఎస్వీ నాయకుల ఇళ్ల వద్ద పహారా కాశారు. మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు నలపరాజు రమేష్‌ను పోలీసులు బుధవారం తెల్లవారుజామున గృహ నిర్బంధం చేసి, అనంతరం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో అణచివేత ధోరణి కొనసాగుతోందని విమర్శించారు. నిరుద్యోగుల పక్షాన, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తుంటే అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూడటం దుర్మార్గమన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ ఏమైందని ఆయన నిలదీశారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో రాజకీయ నిఘా పెట్టడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని ధ్వజమెత్తారు. తక్షణమే అరెస్టయిన నాయకులను విడుదల చేయాలని, విద్యార్థి లోకం పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకుడు పానుగోతు తరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కార్తికేయ బీజేఆర్ గార్డెన్' ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, మార్చి 24 (తొలివెలుగు న్యూస్): మండలంలోని సర్వేల్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన 'కార్తికేయ బీజేఆర్ గార్డెన్' ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం బుధవారం (మార్చి 25) వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్తికేయ గ్రూప్ చైర్మన్ బొబ్బల జితేందర్ రెడ్డి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమ వివరాలు:

ఉదయం 6:30 గంటలకు పుణ్యాహవాచనం, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10:48 గంటలకు ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుభకార్యాల కోసం ఆధునిక వసతులతో, అందుబాటు ధరల్లో ఈ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంగళవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,372.06 పాయింట్లు లేదా 1.89 శాతం లాభంతో 74,068.45 వద్ద, నిఫ్టీ 412.25 పాయింట్లు లేదా 1.83 శాతం లాభంతో 22,924.90 వద్ద నిలిచాయి.

హ్యాండ్స్‌ఆన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ (ఎ+వీ) లిమిటెడ్, ఐజాఅ సిస్టమ్స్ లిమిటెడ్, చీూజXూ లిమిటెడ్, బర్న్‌పూర్ సిమెంట్ లిమిటెడ్, మంగళం గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఇన్నోవిజన్ లిమిటెడ్, రామ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్, జెహెచ్ఎస్ స్వెండ్‌గార్డ్ లాబొరేటరీస్ లిమిటెడ్, యాక్సిస్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్, బైక్ హాస్పిటాలిటీ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.

కోలుకున్న పసిడి...

రూ.1,200 పెరుగుదల

ఫ్లాట్‌గానే వెండి ధరలు

న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లో 4 రోజుల వరుస నష్టాల నుంచి పసిడి బయటపడింది. మంగళవారం 10 గ్రాములకు రూ.1,200 పెరిగి రూ.1.44లక్షలకు (పన్నులు సహా) చేరుకుంది. వెండి ధర మాత్రం పెద్దగా మార్పు లేకుండా కిలోకి రూ.2.30 లక్షల వద్దే ఉన్నట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అంతర్జాతీయంగా కమోడిటీ మార్కెట్లలో రికవరీకితోడు, కనిష్ట స్థాయిల్లో కొనగోళ్ల మద్దతుతో బంగారం ధర పెరిగినట్టు ట్రేడర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో పసిడి ఔన్స్‌కు 17 డాలర్ల వరకు పెరిగి 4,423 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. వెండి సైతం 1% పుంజుకుని ఔన్స్‌కు 69.86 డాలర్ల స్థాయిని చేరుకుంది. '9 రోజుల క్షీణత తర్వాత స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,420 డాలర్ల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఇరాన్ పై దాడులను 5 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో అప్రమత్తతతో కూడిన ఆశావహధోరణి కనిపించింది' అని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు.

డేటా సెంటర్లకు ఏఐ కళ

మెట్రో నగరాల్లో భారీ పెట్టుబడి

ఓపెన్‌ఏఐ కేంద్రం హైదరాబాద్‌కే?

దేశంలో హైఎండ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్ (హెచ్‌సీఎస్) విభాగంలో ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాను‌ఫ్యాక్చరర్) సేవలు అందించే సంస్థ నెట్‌వెబ్ టెక్నాలజీస్‌కు ఎన్విడియా నుంచి రూ,1,734 కోట్ల ఆర్డరు వచ్చింది. ఈ2ఈ నెట్‌వర్క్స్ లిమిటెడ్ అనే మరో సంస్థకు కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ – ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి రూ.177 కోట్ల విలువైన జీపీయూ రిసోర్సెస్ ఆర్డరు లభించింది.ఏఐ విభాగంలో ఎంతో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నట్లు, ఏఐ మౌలిక వసతులు మనదేశంలో విస్తరిస్తున్నట్లు స్పష్టం చేయటానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మనదేశంలో ఏఐ (కృత్రిమ మేధ) కంప్యూటింగ్ సామర్థ్యం విస్తరించేందుకు, ఇండియా ఏఐ మిషన్ కింద సొంత ఏఐ సిస్టమ్స్ ఆవిష్కరించటానికి కృషి జరుగుతోంది. దీనికి ఎన్విడియా నుంచి లభించిన ఆర్డర్ ఎంతగానో దోహదపడుతుందని నెట్‌వెబ్ టెక్నాలజీస్ అంటోంది.

'ఎడ్జ్' వెనుకంజ...

డేటా సెంటర్ల విస్తరణ విషయంలో విశ్లేషకుల అంచనాలు తలకిందులయ్యాయి. క్లౌడ్ సేవల మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుని ఎడ్జ్ డేటా సెంటర్లు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తాయని అంచనా వేశారు. చిన్న డేటా సెంటర్లను (10 మెగావాట్ల కంటే తక్కువ సామర్థ్యం కలిగినవి) ఎడ్జ్ డేటా సెంటర్లుగా పరిగణిస్తారు. ద్వితీయ శ్రేణి నగరాలతో పాటు చిన్న పట్టణాల్లో సైతం ఎడ్జ్ డేటా సెంటర్లు వస్తాయని భావించారు. విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, తిరుపతి, నిజామాబాద్, కర్నూలు వంటి నగరాల్లోనూ ఇటువంటి డేటా సెంటర్లు ఏర్పాటయ్యే రోజు ఎంతో దూరంలో లేదని అంచనా వేశారు. కానీ సాంకేతిక రంగంలో వస్తున్న అనూహ్య మార్పులతో ఈ అంచనాలు తలకిందులు అయ్యాయి. ఏఐ విస్తరణ, ఇతర సాంకేతిక ఆవిష్కరణలతో భారీస్థాయి డేటా సెంటర్లకే గిరాకీ లభిస్తోంది. దీంతో ముంబయి, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్లు, టెక్నాలజీ కంపెనీల అవసరాలకు అనుగుణంగా భారీస్థాయి డేటా సెంటర్లు విస్తరిస్తున్నాయి.

విదేశీ దిగ్గజాల హవా..

మన దేశానికి చెందిన సంస్థలతో పాటు విదేశాలకు చెందిన టెక్ దిగ్గజాలు ఇక్కడ భారీ స్థాయిలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయటానికి సిద్ధపడుతున్నాయి. విశాఖపట్నంలో గూగుల్ 6 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. ఈ విభాగంలో ఇతర సంస్థలను సైతం ఆకర్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్లౌడ్, ఏఐ మౌలిక వసతుల కోసం 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ కొంతకాలం క్రితం వెల్లడించింది. 'చాట్‌జీపీటీ'ని రూపొందించిన ఓపెన్‌ఏఐ అనే సంస్థ మన దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం కల అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది.

రూ.1234తో రీఛార్జ్.. 336 రోజుల వ్యాలిడిటీ!

టెలికాం కంపెనీలు ఎప్పటికప్పుడు కొత్త రీఛార్జ్ ప్లాన్స్ ప్రకటిస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే రిలయన్స్ జియో 336 రోజుల వ్యాలిడిటీతో ఓ రీఛార్జ్ ప్లాన్ తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. సంవత్సరం పొడవునా ఫోన్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే వారికి రిలయన్స్ జియో రూ.1234 ప్లాన్ ఒక అద్భుతమైన వరం. ఈ ప్లాన్ 336 రోజుల బలమైన వ్యాలిడిటీని అందిస్తుంది. అంటే.. మీరు ఒక్కసారి రీఛార్జ్ చేస్తే, సుమారు 11 నెలల వరకు మళ్లీ స్టోర్‌కు వెళ్లడం గానీ, ఆన్‌లైన్ చెల్లింపు చేయడం గానీ అవసరం ఉండదు. కేవలం కాలింగ్ కోసం మాత్రమే ఫోన్ వాడే వాళ్లకు ఇది మంచి ఎంపిక. ప్రయోజనాల విషయానికి వస్తే.. ఈ ప్లాన్ వినియోగదారులకు రోజుకు 0.5 +దీ హై-స్పీడ్ డేటాను అందిస్తుంది. మొత్తం 336 రోజులలో, మీకు 168 +దీ డేటా యాక్సెస్ లభిస్తుంది. డేటా అయిపోయిన తర్వాత, మీ ఇంటర్నెట్ వేగం 64ఎఎజూంకి పడిపోతుంది, కానీ మీ కనెక్షన్ మాత్రం బలంగానే ఉంటుంది.